క్లుప్తంగా

నేటినుంచి ఇల్లెందు - మర్కోడు బస్సు సర్వీసు

ఇల్లెందు: ఇల్లెందు బస్సు డిపో నుంచి కాచనపల్లి, ఆనంతోగు, ఆళ్లపల్లి మీదుగా మర్కోడుకు బస్సు సర్వీసు నడపనున్నట్లు కొత్తగూడెం బస్సు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆదివారం ఇల్లెందులో మాట్లాడుతూ... ఇల్లెందు బస్సు డిపో నుంచి పల్లె వెలుగు బస్సు సర్వీస్ ప్రతీరోజు రెండు సర్వీసులు మర్కోడు వరకు నడపనున్నట్లు తెలిపారు. ఇల్లెందులో ఉదయం 7.30 గంటలకు బయలుదేరుతుందని, మర్కోడు నుంచి 9.30 కు ఇల్లెందుకు తిరుగు ప్రయాణం అవుతుందని తెలిపారు. మరో సర్వీసు మధ్యాహ్నం 2.30 గంటలకు ఇల్లెందులో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు మర్కోడు నుంచి ఇల్లెందుకు తిరుగు ప్రయాణం అవుతుందని తెలిపారు.

సీపీఐలో చేరికలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 19, 12 వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు బండి నరసింహారావు, విజయలక్ష్మీలతోపాటు మరో వంద కుటుంబాలు ఆదివారం సీపీఐలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూనంనేని మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మున్సిపల్ కౌన్సిలర్లు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సిలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య వంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడి నగేష్, భుక్యా శ్రీనివాస్, ఫహీం, యూసఫ్, మాచర్ల శ్రీనివాస్, విజయ్, దుర్గ, రమణమూర్తి, క్రిష్టాఫర్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో క్రికెటర్ మృతి


రవికిరణ్ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని నెంబర్-2 బస్తీకి చెందిన క్రికెట్ క్రీడాకారుడు బొల్లి రవికిరణ్(23) ఆదివారం క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురయ్యాడు. తోటి క్రీడాకారులు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా వాంతులు చేసుకుని కుప్పకూలిపోయాడు. డాక్టర్, సిబ్బంది పరీక్షించేలోపే ప్రాణాలు వదిలాడు. మూడు రోజులుగా ఛాతిలో నొప్పి వస్తున్నా తనకేమీ కాదంటూ నిర్లక్ష్యం చేసినట్లు బంధువులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బోళ్ల సూర్యం, మాజీ కౌన్సిలర్ సీహెచ్ రమేష్‌లు రవికిరణ్ కుటుంబానికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

హరినాథ్‌రెడ్డి మృతి క్రీడాకారులకు తీరని లోటు


నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

పాల్వంచ: రాష్ట్ర ఒలింపిక్ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర వాలీబాల్ సెక్రటరీ బి.హరినాథ్‌రెడ్డి మృతి క్రీడాకారులకు తీరని లోటని జిల్లా లాన్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు జి.యుగంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనివాసకాలనీలోని లాన్ టెన్నిస్ కోర్టు ఆవరణలో హరినాథ్‌రెడ్డి సంతాప కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... క్రీడాకారులకు ఎనలేని సేవలు అందించారని, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వై.వెంకటేశ్వర్లు, కె.జక్రియా, తాళ్లూరి లక్ష్మణ్, ఎండీ.ఆరీఫ్, అన్నం వెంకటేశ్వర్లు, ఎస్‌కే.సోందు, ఎం.భాస్కర్, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

టేకులపల్లి: రామోజీ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి టేకులపల్లి సెంటర్‌లో పాత్రికేయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన నాయకులు కొవ్వొత్తులతో రామోజీకి నివాళి అర్పించారు. లక్కినేని సురేందర్, బాలు, గుడిపూడి మోహన్‌రావు, రాయల అన్వేష్, శ్రీరామమూర్తి, నోముల భానుచందర్, కదుదుల వీరన్న, రాజు, రాజ్‌కుమార్, సతీష్, సందీప్, రవి, కార్తీక్, దామోదర్, కిరణ్, బి.శివ, విలేకరులు పాల్గొన్నారు.

మరో సబ్‌స్టేషన్ మంజూరయ్యేనా?

- రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లు
- నిత్యం సమస్యలకు నిలయంగా మారుతున్న పరిస్థితి


కేఎస్‌పీ రోడ్‌లోని సబ్‌స్టేషన్

పాల్వంచ: శరవేగంగా విస్తరిస్తున్న పాల్వంచలో ఇప్పటికే విద్యుత్ అంతరాయం తరచు చోటుచేసుకుంటోంది. దశాబ్దాల క్రితం కేఎస్‌పీ రోడ్‌లో ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ అప్‌గ్రేడ్ కాక పోవడంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఓవైపు వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండటంతో పాటు విద్యుత్ కనెక్షన్లు విపరీతంగా పెరగడంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడుతోంది. ఈ క్రమంలో ఎండవేడిమికి పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో టెంపరేచర్ పెరిగి పేలిపోయే ప్రమాదం నెలకొంది. దీంతో ఇక్కడి సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి తరచు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను నీటితో తడిపి చల్లార్చుతూ నెట్టుకొస్తున్నారు.

కాగా ఇప్పటికే ఈ సబ్‌స్టేషన్ పరిధిలో నిత్యం పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్ల నేపథ్యంలో మరో సబ్‌స్టేషన్‌ను శ్రీనివాస కాలనీ ఏరియాలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విస్తరిస్తున్న పట్టణం.. పెరుగుతున్న కనెక్షన్లు...

ఈ సబ్‌స్టేషన్ కింద 33 కేవీ, 11 కేవీ లైన్లు ఉండగా ఇప్పటికే సుమారు 35వేల నుంచి 40వేల కనెక్షన్లు పెరిగాయి. కమర్షియల్, డొమెస్టిక్, హెచ్‌టీ కనెక్షన్లతో సబ్‌స్టేషన్‌పై భారం పడుతోంది. తరచు విద్యుత్ అంతరాయం చోటు చేసుకుంటోంది. ఈ సబ్‌స్టేషన్ పరిధి కరకవాగు, గాజుల గూడెం, పేటచెరువు, పిల్లవాగు, కుంటినాగులగూడెం, శ్రీనివాస కాలనీ, పాత పాల్వంచ వరకు విస్తరించి ఉంది. షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్‌లు, కమర్షియల్ సర్వీస్‌లు సైతం భారీగా ఉన్నాయి. దీంతో పాటు లైన్ల మధ్య దూరం కూడా ఉన్నాయి.

తరచూ విద్యుత్ సమస్యలు...

సబ్‌స్టేషన్ పరిధితో పాటు కనెక్షన్లు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటోంది. స్తంభాల మధ్య, కనెక్షన్ల మధ్య దూరం ఎక్కువగా ఉన్నాయి. దీంతో ట్రిప్పింగ్ అవుతున్నాయి. ఈ క్రమంలో బ్రేక్ డౌన్ అయిన సమయంలో సమస్యను పసిగట్టి పరిష్కారం చేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో సమస్య జఠిలంగా మారడంతో సిబ్బందికి తలనొప్పిగా మారింది. అంతేగాక ఒక లైన్‌మెన్ 8 మంది జూనియర్ లైన్‌మెన్‌లు ఉండగా మరింతమంది సిబ్బంది అవసరం ఉంది. తగిన సిబ్బంది లేక ఉన్న వారిపై అధిక పనిభారం పడుతోంది. పనిభారంతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ విషయమై ఏఈ మధుబాబుని వివరణ కోరగా... మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు విషయం ఉన్నతాధికారుల పరిశీలన ఉందని తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్‌లను తడుపుతున్న దృశ్యం (ఫైల్)

మరో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి



దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కావడం, కనెక్షన్లు పెరగడం, విద్యుత్ వినియోగం వల్ల విద్యుత్ సమస్యలు నిత్యం ఉత్పన్నమవుతున్నాయి. పెరుగుతున్న పట్టణ విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మరో సబ్‌స్టేషన్‌ను శ్రీనివాసకాలనీ ఏరియాలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ముదిగొండ కిరణ్ కుమార్, బాపూజీ నగర్

సమస్య కొలిక్కి రావడం లేదు



సబ్‌స్టేషన్ పరిధిలో అధిక కనెక్షన్‌ల వల్ల ట్రిప్పింగ్‌లు అవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. దీని వల్ల నిత్యం కరెంట్ పోతుంది. పోయిన ప్రతిసారి గంటల సమయం పడుతుంది. అదేమంటే ట్రిప్ అయిన చోటు కనిపెట్టి దానిని సరిచేసేసే సరికి సమయం పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– తలారి నాగరాజు, నెహ్రూనగర్

కార్యకర్తల కృషి మరువలేనిది

ఇల్లెందు: ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేసిన కార్యకర్తలకు, ప్రజలకు, అభిమానుల కృషి మరువలేనిదని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు విశేషంగా కృషి చేసినట్లు చెప్పారు.

నిన్నటి ఎంపీ ఎన్నికల్లో కూడా బాగా కష్టపడడం వల్లే అత్యధికంగా మెజార్టీ లభించిందన్నారు. ఎంపీగా గెలిచిన బలరాం నాయక్, ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్నలకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడితో వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో పని చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డానియేల్, సైదులు, రామారావు, మడుగు సాంబమూర్తి, సదానందం, ఈసం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో పాల్వంచలోని బీజేపీ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. స్థానిక వికలాంగుల కాలనీలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెరువు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ సారథ్యంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఎదగబోతోందన్నారు. అన్నివర్గాల ప్రజలకు మోదీ న్యాయం చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న మంజూరు అలీ

పాల్వంచ: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ ఎండీ.మంజూరు అలీ అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద జిల్లా స్థాయి తెలంగాణా ఉద్యమకారుల ఫోరం సమావేశాన్ని ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 చదరపు గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించాలని, పింఛన్ అమలు చేయాలని, ఉచిత వైద్యం, బస్సు పాస్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అసలైన ఉద్యమాకారులకు గుర్తించేందుకు కమిటీని వేయాలని కోరారు. ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమాకారులు శ్రీపాద సత్యనారాయణ, బరగడి దేవదానం, నిమ్మల రాంబాబు, బొల్లం భాస్కర్, బుడగం నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇజ్జగాని రవిగౌడ్, కట్టా ఐలయ్య, గొడ్ల మోహన్‌రావు, గూడెల్లి యాకయ్య, కలకోటి ఐలయ్య, మైల మురళీ, గద్దం సీతారాములు, కల్యాణ్‌కుమార్, ఇమామ్ పాషా, మౌలానా, జల్లారపు నాగేశ్వరరావు, రాయబరపు వెంకటేశ్వర్లు, రామారావు, సంజీవరావు, భాస్కర్, ఆకుల రాములు, ప్రభావతి, పార్వతి, రమణ, నిర్మల, జాన్ విక్టోరియా, మంగాదేవి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

'ట్రైబల్స్' మనుగడకు పోరాడాలి..


మాట్లాడుతున్న వెంకట్రామయ్య

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచంలోని 90 దేశాల్లో 47.67 లక్షల మంది మూలవాసులు, ఆదివాసీలు (ట్రైబల్స్) ఉన్నారని, దక్షిణాసియాలో ఉన్న మూలవాసులు, ఆదివాసులు ట్రైబల్స్ జనాభాలో మూడింట రెండువందల మంది భారతదేశంలో ఉన్నారని, వీరంతా ట్రైబల్ మనుగడకోసం, గౌరవప్రదమైన పోరాటాలు సాగించాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, డాక్టర్ వాసవీ కిరోలు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆలిండియా ఫోరం ఆదివాసీల రాష్ట్ర సదస్సు జాతీయ నాయకుడు సుర్ణపాక నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేడు దేశంలో ఆదివాసీ మహిళలు, వివిధ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని పితృహత్య తెగల మధ్య ఘర్షణలు, కిడ్నాప్, మూకుమ్మడి మానభంగాలు, అదృశ్యం కావటం, నిర్వాసితం వారి సంప్రదాయక అటవీ భూమి నుంచి గెంటివేతలు పెద్ద ఎత్తున జనాభా ప్రవేశించటం, సామాజిక ఆర్థిక దోపిడీలు ప్రపంచంలో లేని తీవ్రమైన సమస్యలు ఈరోజు ట్రైబల్స్ దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్నారని వాపోయారు. దేశంలో అనేక చట్టాలను పరిశీలించాలని, ఇవి ఎవరి చేతిలో కీలుబొమ్మగా మారాయో.. ట్రైబల్స్ అర్థం చేసుకోవాలన్నారు. భారతదేశంలో ట్రైబల్‌కు సంబంధించిన ముఖ్యమైన ఎజెండాను ఈ సదస్సులో గుర్తించాలన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ట్రైబల్స్ ఇంకా వెనకబడిన ప్రాంతాలలోనే, అభివృద్ధికి ఆమడదూరంలో నెట్టి వేయబడ్డారని, వారి హక్కుల కోసం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం నాయకులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి చేయూత


వివాహ వేడుకలో ఖురేషితో మత పెద్దలు

కొత్తగూడెంఅర్బన్: నిరుపేద యువతి వివాహానికి మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి చేయుతనదించారు. ఆదివారం ఓల్డ్ డిపో ఏరియా మసీదులో న్యూగొల్లగూడెం వాసి మహమ్మద్ రఫాత్ కుమార్తె మహమ్మద్ ముబీనా వివాహం జరిగింది. ఫర్నిచర్, కిచెన్ సామగ్రిని నయీమ్ ఖురేషీ అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్ అమీర్ క్వాద్రీ, జాఫర్ ఖురేషి, మైనుద్దీన్, జానీ, సెక్రటరీ ఆఫ్సర్, బాబుజాని, రజాక్, జుబేద్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ కార్మికులకు సమాన పనికి సమాన వేతనంగా నెలకు రూ.18,000 ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడుగా రేగళ్ల పెద్ద తండాకు చెందిన గుగులోతు వెంకటేశ్వర్లును నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. నాగుల రవికుమార్, మాలోతు వీరు నాయక్, వినయ్, జర్పుల అశోక్, తాటిపాముల హరికృష్ణ ఉన్నారు.

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఈఓ, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో పండిట్, పీఈటీ పదోన్నతులు అందరికీ వస్తాయని ఆశతో ఆనందంలో మునిగితేలుతున్నారని డీఈఓ వెంకటేశ్వరచారి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ద్వారా శనివారం జారీ అయిన ఉత్తర్వులతో జిల్లాలో పీఈటీలు, పండిట్ ఉపాధ్యాయులకు ప్రయోజనం కలుగబోతుందని చెప్పారు. వీరందరినీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వడానికి ఆదివారం స్థానిక పాత పాల్వంచ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల అర్హత సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టినట్లు వివరించారు. తెలుగు, హిందీ 172 మంది బోధిస్తున్న లాంగ్వేజ్ పండిట్లను ఇక నుంచి ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజెస్) లుగా గుర్తింపబడతారని చెప్పారు. మూడేళ్ల క్రితమే ప్రభుత్వం ఈ అప్‌గ్రెడేషన్ కసరత్తు చేసి కొన్ని కారణాలతో పెండింగ్‌లో పడడంతో ఇప్పుడు కొలిక్కి వచ్చిందన్నారు. అప్‌డేట్ అయిన పోస్టుల ఉపాధ్యాయులు తెలుగు మీడియంలోనే ఉండడం విశేషమన్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో కేడర్‌లో మార్పులు జరుగుతున్నందున విద్యాశాఖ అధికారి అన్ని మండలాల విద్యాశాఖాధికారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ బదిలీలు ప్రమోషన్ జిల్లాలో సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని డీఈఓ వెంకటేశ్వరచారి కోరారు.

కలప ఆన్‌లైన్ పర్మిట్‌లో జాప్యం


మాట్లాడుతున్న ధనశ్వేర్‌రావు

కొత్తగూడెంరూరల్: జిల్లాలో టేకు కలప ఆన్‌లైన్ పర్మిట్ జాప్యం జరుగుతోందని, దీంతో కలప కొనే వారు ఇబ్బందులు పడుతున్నారని సామిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి ధనశ్వేర్ రావు, కోశాధికారి డీకే శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని శంకర్ సామిల్లు నిర్వాహకులు, కలప డిపోల నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టేకు కలప అవసరమయిన వారికి విక్రయించేందుకు అటవీ శాఖ పర్మిట్ జారీకి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, దీంతో సామిల్లు నిర్వాహకులు, కలప కొనుగోలుదారులు సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి కలిసి, తమ సమస్యలను విన్నవించటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర సామిల్లు అసోసియేషన్ ఆదేశాల మేరకు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సామిల్లు యాజమానులు, కలప డిపోల నిర్వాహకులు బి.రాంబాబు, ఏ.సాయికుమార్, బి.విక్రమ్, యువకాంత్, బి.శివకుమార్, నర్సింహాచారీ తదితరులు ఉన్నారు.

కుదిరిన బొగ్గు రవాణా ఒప్పందం


ఎమ్మెల్యేతో కోల్ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, లారీ ఓనర్లు, యూనియన్ ప్రతినిధులు

ఇల్లెందు: కొంతకాలంగా కేటీసీ-2 నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి నిలిచిన బొగ్గు రవాణా ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. ఆదివారం ఇల్లెందు సింగరేణి గెస్ట్ హౌజ్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్, శ్రీదేవి లారీ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులు, లారీ ఓనర్లతో జరిగిన చర్చలు ఫలించాయి. దీంతో ఇక బొగ్గు రవాణాకు మార్గం సుగమం అయింది. కొంతకాలంగా బొగ్గు రవాణా నిలిచిపోవడంతో కార్మికులు, లారీల ఓనర్లు తీవ్రంగా నష్టపోయారు. యూనియన్ నాయకులు మిర్యాల రంగయ్య, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటాలే శరణ్యం


ఇఫ్టూ జెండా ఎగుర వేస్తున్న యాకుబ్‌షావలీ


మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవటం కోసం, భవిష్యత్ కాలంలో మెరుగైన వేతనాల అమలు కోసం కార్మికులంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఇఫ్టూ ఇల్లెందు ఏరియా 5వ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మిక రంగంలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ పెరిగిపోయిందన్నారు. ఔట్ సోర్సింగ్ విధానం ఎక్కువై పోయిందని, పాలకులు అన్ని రంగాలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనులు చేయిస్తూ వేతనాలు మాత్రం సమానంగా ఇవ్వటం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని చట్టం చెబుతున్నా చుట్టబండలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం సమరశీల పోరాటాలే శరణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్ యాకుబ్‌షావలీ, రేసు బోసు, వై.గోపాల్‌రావు, పాయం వెంకన్న, రేసు సరిత, వీరన్న, గురునాథం, రఘు, లక్ష్మణ్, సీతారాములు, కుమార్, బాలు చౌహాన్, నరేష్, రఫీ, రాజు, వెంకన్న, గోపి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి..


చాపలవారిగుంపులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

ఇల్లెందురూరల్: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రొఫెసరల్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయులు ఆదివారం గ్రామాలలో పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్పొరేట్ పాఠశాలలకు, దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని వివరించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులందరినీ పాఠశాలలు ప్రారంభం రోజు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్: 563 గ్రూప్-1 పోస్టుల కోసం ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కోసం అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు సెంటర్లు, ధన్వంతరి ఫార్మసీ కళాశాలలో ఒక సెంటర్ చొప్పున మొత్తం మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. అబ్దుల్‌కలాంలోని ఒక సెంటర్లో 600 మందికి గాను 451 మంది, మరో సెంటర్‌లో 606 మందికి 455 మంది హాజరయ్యారు. ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో 264 మందికి 215 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే అభ్యర్థులను లోపలికి అనుమతించారు. కాగా పరీక్ష కేంద్రాలను ఎస్పీ రోహిత్‌రాజు సందర్శించారు. పరీక్ష కోసం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల పరిధిలో 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


పాల్వంచ: పరీక్ష హాల్ వద్ద అభ్యర్థులు

పాల్వంచరూరల్: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాల్వంచలోని ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.

ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో అధిక శాతం అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులను తనిఖీలు చేసి అధికారులు లోపలికి పంపించారు.


పాల్వంచరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

నవభారత్ స్కూల్‌లో గ్రూప్-1 పరీక్షను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు. డిగ్రీ కళాశాలలో 552 మంది అభ్యర్థులకు గాను 428 మంది హాజరు కాగా 124 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం అధికారి తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సులోచనారాణి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అబ్జర్వర్ స్రవంతి పరీక్షలను పర్యవేక్షించారు.